

# ఇది మామూలు కథే

పింకస్. నారాయణ

"“టెంపరేచర్ ?”

“వన్‌నాట్ ఫైవ్ పాయింట్ ఫైవ్ !”

“ఐసుందా ?”

“దొరుకుతుంది ... తెప్పించమంటారా డాక్టర్ !”

తలుపుదగ్గర తల్లి ఏడుస్తున్నది. “పొద్దున వచ్చాడు ... పదిరోజుల తరువాత పొద్దున వచ్చాడు ... వచ్చాడు గదా అని సంతోషించాను ... సంతోషించినంత సేపు పట్టలేదు జ్వరం ముంచుకు రావటానికి... మూసిన కన్ను తెరవకుండా ఎలా పడివున్నాడో చూడండి !?”

తల్లి పెద్దకొడుక్కు భయపడుతూ నోరు నొక్కుకుంటున్నా బెక్కు ఆగటంలేదు. “డాక్టరు ఏమన్నాడురా?”

“వాడు గనుక త్రాగుడు మానక పోతే చస్తాడన్నాడు !”

పెద్దకొడుకు మాటలు ఆవిడకు అపశకునంలా వినిపించినాయి. కళ్ళల్లో

నీళ్ల ఉప్పెనలా ఉబుకుతుండగా 'అలా అనబోకురా' అన్నట్లుగా చేయూప సాగింది.

"వాడు బాగుపడాలంటే ఒక్కటే నమ్మా—వాడు చచ్చినా శవాన్నిగూడా ఈ గడపముందు పడవేయనీయనను-నేను చేయాల్సిందేదో చేసి చూస్తాను!" అన్నాడు కోపంగా. తల్లి భోరుమన్నది–ఆ మాటలు వినలేనట్లుగా!

* * *

"అమ్మా!" తల్లిని అర్థరాత్రప్పుడు ఊపుతూ పెద్దగా పిలిచాడు– 'తమ్ముడు పలవరిస్తున్నాడే!' అతడి గొంతు భయంతో బొంగురుపోతుంది.

యిద్దరూ చిన్నకొడుకు పడుకున్న మంచం దగ్గరకు వెళ్ళారు. అతడి నోటినుండి కారుతున్న చొంగ అతడి చేతిలోలేని జీవితంలా జారిపోతుంది. వేడికి వణికిపోతున్న శరీరం బలవంతాననైనా మార్చలేని అతడి దురలవాట్లలా పేట్రేగిపోతున్నది.

ఆ శరీరంమీద చేయివేసి అదుముతున్న కన్నతల్లి కళ్ళల్లో ప్రాణాలు గిలగిల లాడుతున్నాయి. ఆమె చిన్న కొడుకును చూడలేనట్లుగా కళ్ళు మూసుకుంటే...కళ్ళు తిరిగి ఆమె ఎక్కడ పడిపోతుందోనన్నట్లుగా ఆమె భుజాలు పట్టుకున్నాడు పెద్దకొడుకు. అతడి ముదురు పెదాలు లేత ఆకుల్లా వణుకుతున్నాయి... కరుకు చూపులకు కన్నీటి తెరలు అడ్డుపడుతున్నాయి. బండరాయిగుండె మైనంలా కరిగిపోతుంది.

"చూస్తే చిన్న వెధవ చచ్చేటట్లే వున్నాడు!" గొణుక్కుంటున్నాడు వుండి వుండి.

"దేవుడికి ముడుపు కట్టుకో ... వాడు బ్రతికి బట్టగట్టితే కొండకొస్తానని!" చెవి దగ్గర రహస్యం చెప్పినట్లుగా అన్నాడు. "నేనూ వస్తాను!"

"అలాగే" నన్నట్లుగా తల ఊపింది తల్లి.

ఆమె అటు వెళ్ళగానే తమ్ముడి పొట్టమీద భయం భయంగా చేయి వేశాడు.

"నీవు బ్రతకరా తమ్ముడూ! నీ వెలాంటివాడివైనా నీవు నాకు తమ్ముడివేరా బాబూ!" అన్నట్లుగా కళ్ళు మూసుకున్న అతడి కళ్ళవైపే చూస్తున్నాడు. "నీవు ఆ పేకాట మానేయ్... త్రాగుడు మానేయ్...సిగిరెట్లు మానేయ్ ... శుభ్రంగా ఉద్యోగం చేసుకో ... పెళ్ళి చేసుకో ... అమ్మకు పుట్టిన ఆరుగురిలో ఈనాడు మనమిద్దరమేరా మిగిలింది...నీకు నేనూ...నాకు నీవూ తప్ప మరెవ్వరూ లేరురా!"

* * *

"బ్రెడ్ కావాలని నీకు తెలియదా! ...లేకపోతే తిండే తింటాడులే ... కాకపోతే చస్తాడులే అనుకుంటున్నావా!" తల్లిమీద గయ్యిన లేచాడు మూడురోజుల




తరువాత — జ్వరం తగ్గి పత్యంతిన్న చిన్నకొడుకు.

తల్లి భయం భయంగా చిన్న కొడుకు ముఖంలోకి చూచింది.

"చెయ్యటం చేతగాకపోతే ఇంట్లో నుంచి వెళ్ళగొడితే సరిపోలా... ఉంచు కోవటమెందుకు ... కడుపు మాడ్చట మెందుకు !"

అరగంటబట్టీ అన్నీ వింటున్న పెద్దకొడుకు తన గదిలోనుంచి విసురుగా బయటకు వచ్చాడు. "ఏఁవి టోయ్... నీ బోడి అరుపులు ... బోడి ముండా వేషాలూ అని ... ఇష్టమయితే నోరుమూసుకు పడివుండు ... లేదా బయటకు నడు...నీవు చేసే అణా కానీ బోడి ఉద్యోగానికి ఆఫీసర్ననుకుంటు న్నావేమో ... ఒళ్లు దగ్గిర పెట్టుకు మాట్లాడు ... అమ్మనేమైనా అంటే పళ్లు వాయగొడతాను !" అంటూ అరవ సాగాడు.

"ఎవ్వడూ ఇక్కడ చేవ చచ్చి లేడు — మళ్ళీ వాయగొడతారు !" అన్నాడు కర్రపుల్లలా లేస్తూ తమ్ముడు.

"ఏరా కొట్టు చూద్దాం !"

"ఛత్...నిన్ను కొట్టాలిగూడానా... నేను చస్తే నా శవం కాకులూ, గద్దలైనా పొడుచుకు తినాల్సిందేగానీ నీవు ముట్టు కోవడానికి వీల్లేదు !" రోడ్డెక్కాడు తమ్ముడు.

"మళ్ళీ చస్తే నా యింట్లో కాలు పెట్టనీయన్రా నిన్ను — అరేయ్ ... నిన్ను కాకులూ, గద్దలూ ముట్టుకున్నా వాటికే పాపం చుట్టుకుంటుందిరా !"

తల్లి ఆ యింట్లోనే శవం లేచినట్టుగా ఘొల్లుమన్నది.

ఇంత గంద్రగోళంలోనూ నిమ్మకు నీరెత్తినట్లు ఏ ఉద్వేగమూ లేకుండా కూర్చున్నది ఒక్కతే — ఆ యింటి పెద్దకోడలు !

"ఇలా తెగతెంపులు చేసుకోవటం వాళ్ళకు ఇది నూటొక్కటోసారి !" అనుకున్నది !